

ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

సర్వీస్ రోడ్డు స్థల సేకరణకు కిషన్‌రెడ్డి చొరవతో మోక్షం

గోల్నాక, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేటలో నాలుగు సంవత్సరాలుగా పరిష్కారం కాని అంబర్‌పేట ఫ్లైఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు స్థలసేకరణకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి చొరవతో మోక్షం లభించింది. ఈ మేరకు బుధవారం బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, నాయకుడు మూల రవీందర్‌గౌడ్ తదితరులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అంబర్‌పేట నుంచి గోల్నాక రాకపోకలకు చుట్టూ మూడు కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు మాత్రమే సర్వీస్ రోడ్డు ఉండడం, మరోవైపు సర్వీస్‌రోడ్డు గోడ కట్టడంతో అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నూతన బ్రిడ్జి ప్రారంభమైన ఆరు నెలల్లోపు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి చొరవతో ఆ కష్టాలన్ని తీరాయని వారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్.కె.రాం చందర్, కేసరి నర్సింగ్‌రావుయాదవ్, కె.రవీందర్, కె.కృష్ణ, కె.సునీల్‌కుమార్, సలీం, మహమ్మద్ మోసిన్, బ్రహ్మచారి, గాజుల గోపాల్, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్లీన్ అండ్ గ్రీన్



పిచ్చిమొక్కలు, మట్టికుప్పలు తొలగించడంతో శుభ్రంగా కనిపిస్తున్న పీఎస్ ఆవరణ

చిక్కడపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో మూడు రోజులుగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండు సంవత్సరాల కిందట కార్మికశాఖకు చెందిన నూతన విశాల భవనానికి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ను మార్చిన క్రమంలో భవనం చుట్టుపక్కల చెట్లు పెరిగిపోయాయి. పక్కనే ఉన్న కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలోని చెట్టు కొమ్మలు పీఎస్ ఆవరణలోకి పెరగడంతో ఆ కొమ్మలను కొట్టివేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కుప్పలుగా చేరిన మట్టిని, చెత్తాచెదారాలను లారీల ద్వారా తొలగించారు. అదేవిధంగా పీఎస్ భవనం చుట్టూ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పీఎస్ భవనం లోపలి భాగంగా ఫైల్‌లు, టేబుల్‌లు, కుర్చీలు పొందికగా ఏర్పాటు చేశారు.

కచ్చానాలా పై కప్పునకు మరమ్మతులు



కచ్చానాలా పై కప్పు పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసు

ముషీరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్ డివిజన్ పీ అండ్ టీ కాలనీలో కచ్చానాలాపై కప్పు అధ్వాన స్థితికి చేరుకోవడంతో బుధవారం పై కప్పు పునర్నిర్మాణానికి జీహెచ్ఎంసీ అధికారులు పనులు ప్రారంభించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, వర్క్ఇన్‌స్పెక్టర్ దాసు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వై. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ స్థానిక ప్రజలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ దృష్టికి తీసుకెళ్లి పైకప్పు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే కృషిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ.వి.నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ నేతలు

కళాకారుల సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ.వి.నర్సింహారెడ్డికి చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి.రమణ, ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కల్లు గీత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం రవీంద్ర భారతిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భజన, తాంబూర, డప్పుల కొలువు, కోలాటం కళాకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, పక్కా గృహాలు కల్పించాలని, ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

ఆర్థిక అసమానతలు తొలగించడంలో ప్రభుత్వాలు విఫలం : గాదగోని రవి

రాంనగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు తొలగించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆరోపించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన ఎంసీపీఐ(యు) సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విధ్వంసంలో భాగమే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి అని పేర్కొన్నారు. మతం, ఆచారం, వ్యక్తిగతం, ఉన్మాదం సమాజానికి పెను ముప్పు వంటిదన్నారు. రాష్ట్రంలో పేరుకుపోయిన ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. ఆర్టీసీ బస్‌చార్జీలను తగ్గించాలన్నారు. ఇటీవల మరణించిన ఎంసీపీఐ(యు) నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, కుమారస్వామి, సుకన్య, మట్టయ్య, మంద రవి, రమేష్, నాగార్జున, జబ్బర్‌నాయక్ పాల్గొన్నారు.

పెంచిన బస్‌చార్జీలను ఉపసంహరించుకోవాలి

బర్కత్‌పుర, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్‌చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతామని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. విపరీతంగా బస్‌చార్జీలను పెంచి సామాన్య, మధ్యతరగి వర్గాల ప్రజలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆర్థిక భారం మోపుతుందని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెంచిన ఆర్టీసీ చార్జీల వలన విద్యార్థులు, చిన్నవ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన బస్‌చార్జీలకు నిరసనగా యువమోర్చా ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులు, యువత అన్నివర్గాల ప్రజలు ఈ ఆందోళనలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

12 నుంచి పల్స్‌పోలియో

అంబర్‌పేట క్లస్టర్ పరిధిలో 183 కేంద్రాలు

5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు



ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట క్లస్టర్ డాక్టర్ పద్మజ

ముషీరాబాద్, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): పోలియోరహిత సమాజ స్థాప న కోసం ప్రభుత్వం ఈనెల 12న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని చేపట్టింది. మొదటిరోజు ప్రధాన కేంద్రాల్లో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మొదలుకొని 5సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందు తప్పనిసరి వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు (యూపీహెచ్‌సీ)లతోపాటు ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు చుక్కల మందు వేసే కార్యక్రమం చేపట్టింది. ముషీరాబాద్ నియోజకవర్గంలోని యూపీహెచ్‌సీలలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బుధవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో అంబర్‌పేట క్లస్టర్ డాక్టర్ పద్మజ స్థానిక వైద్యులతో పల్స్‌పోలియోపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్, భోలక్‌పూర్, తిలక్‌నగర్, ఏఎంఎస్, బాగ్‌అంబర్‌పేట, హ్రాస్‌పెంట వైద్యులచే సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

183 కేంద్రాల్లో పల్స్‌పోలియో..

అంబర్‌పేట క్లస్టర్ పరిధిలోని ఆయా ప్రభుత్వ ఆస్పత్రులకు సంబంధించి 183 కేంద్రాల్లో పోలియో చుక్కల మందులు వేయనున్నారు. ముషీరాబాద్‌లో 15 కేంద్రాలు, భోలక్‌పూర్‌లలో 26 కేంద్రాలు, రంగానగర్‌లోని బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీలో 20 కేంద్రాలు, ఏఎంఎస్‌లో 20 కేంద్రాలు, తిలక్‌నగర్ యూపీహెచ్‌సీలో 30 కేంద్రాలు, బాగ్‌అంబర్‌పేటలో 35 కేంద్రాలు, హ్రాస్‌పెంటలో 29 కేంద్రాల్లో పిల్లలకు చుక్కల మందులు వేయనున్నారు.

5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ చుక్కల మందులు వేయించాలి

5సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరి పల్స్‌పోలియో చుక్కలు వేయించాలి. పిల్లలకు జ్వరం, విరోచనాలు ఇతర సమస్యలు ఉన్నా చుక్కల మందు వేయించవచ్చు. ప్రధాన కూడళ్లు, స్థానికంగా ఉండే కమ్యూనిటీహాళ్ల వద్ద పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. 13, 14 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి తమ సిబ్బంది పోలియో చుక్కల మందు వేయించుకొని వారిని గుర్తించి చుక్కల మందు వేస్తాం. - అంబర్‌పేట క్లస్టర్ డాక్టర్ పద్మజ

వీధుల్లో ప్రచారం



చిన్నారులకు తప్పనిసరి చుక్కల మందు వేయించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు వీధుల్లో ప్రచారం చేస్తున్నాం. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు వీధుల్లో తిరుగుతూ 5సంవత్సరాలలోపు చిన్నారులను గుర్తించి చుక్కల మందు వేయించేలా చర్యలు చేపట్టాం. తమ ఆస్పత్రి పరిధిలో 2,686 మంది చిన్నారులు ఉన్నారు. వారందరికీ చుక్కల మందు వేయిస్తాం.
- డాక్టర్ మనోజ్‌రెడ్డి, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి

సామాజిక సంస్కరణల ఉద్యమశీలి రఘుపతి వెంకటరత్నం



మాట్లాడుతున్న కోలేటి దామోదర్, పక్కన కళా జనార్ధనమూర్తి

చిక్కడపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో పలు అంధవిశ్వాసాలు, మూఢనమ్మకాలు ప్రబలి ఉన్న కాలంలో ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా కృషిచేసిన తెలుగువారు కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నంనాయుడులు అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. రఘుపతి వెంకటరత్నంనాయుడు బ్రహ్మసమాజం ద్వారా కుల మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక సంస్కరణల ఉద్యమశీలి అని పేర్కొన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా రఘుపతి వెంకటరత్నంనాయుడు యాది పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కోలేటి దామోదర్ పాల్గొని మాట్లాడుతూ గొప్ప విద్యావేత్త వెంకటరత్నంనాయుడు అని తాను ఉపన్యాసకుడిగా పని చేస్తున్న విద్యాలయంలో స్త్రీలకు ప్రవేశం కల్పించి సహ విద్యను ప్రోత్సహించి బ్రిటీష్ ప్రభుత్వంచే నైట్‌హుడ్ బిరుదు అందుకున్నారని చెప్పారు. స్వతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని జైలుశిక్ష అనుభవించారని వివరించారు. ప్రజలు ఆయనను బ్రహ్మర్షిగా పిలిచేవారని ఇందుకు కారణం బౌద్ధమతంలో దయాగుణం క్రైస్తవ మతంలో సేవాగుణంతో కలిసి ఆయన జీవించడం అని చెప్పారు. రచయిత్రి శైలజామిత్ర, గాయకుడు రామోజీ, గానసభ పాలకమండలి సభ్యులు గీతాదేవి పాల్గొన్నారు.

'జీవితంలో మార్పు కోసం' పుస్తకావిష్కరణ



జీవితంలో మార్పు కోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవి, మైన్స్ విభాగం మాజీ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్, బిక్కి కృష్ణ తదితరులు

రాంనగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు, రచయిత రమేష్ ధీరజ్ రాసిన జీవితంలో మార్పు కోసం పుస్తకంలో మానవ విలువల గొప్పతనాన్ని తెలియజేశారని ప్రముఖ కవి, మైన్స్ విభాగం మాజీ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్ పేర్కొన్నారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన చిక్కడపల్లిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు, రచయిత రమేష్ ధీరజ్ రాసిన జీవితంలో మార్పు కోసం పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రమేష్ ధీరజ్ చిన్న వయసులో చనిపోయిన అక్షరాల రూపంలో మంచి భావాల రూపంలో ఆయన బతికే ఉంటారని అన్నారు. ప్రముఖ కవయిత్రి డాక్టర్ విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ రమేష్ ధీరజ్ పుస్తకంలోని ప్రతి మాట నేటి యువతకు మార్గదర్శకంగా ఉందన్నారు. కుమారుడు ధీరజ్ రాసిన పుస్తకాన్ని అతని మరణాంతరం అతని తల్లి పుస్తకాన్ని వెలువరించడం వెలకట్టలేనిదన్నారు. ప్రముఖ కవి డాక్టర్ జెన్ని విద్యాధర్ మాట్లాడుతూ ఒక నటుడుగా సినిమాలలో, సీరియల్స్‌లో నటిస్తూనే ధీరజ్ రెండు మానవీయ విలువలు గల గ్రంథాలను వెలువరించడం ఇతరులకు ఆదర్శం అన్నారు. ప్రముఖ కవయిత్రి రాధాకుసుమ పుస్తకాన్ని సమీక్షిస్తూ ధీరజ్ వంటి మంచి రచయితను కన్న కొడుకును కోల్పోయిన తల్లి రమాదేవి దుఃఖం వర్ణించలేనిదన్నారు. కార్యక్రమంలో యాంకర్ పద్మలత, కథ రచయిత పెద్దూరు వెంకటదాసు, ధీరజ్ సోదరుడు గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ ఆనంద్‌కుమార్, ఏసీపీ యాదగిరి

కవాడిగూడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవన విధానానికి అలవాటు పడిన వారిలో మానసిక ఒత్తిడి ఏదో ఒక రూపంలో మనిషి జీవితాన్ని ఇబ్బందులు పాలు చేస్తుందని అలాంటప్పుడు ధైర్యంగా ఉండి దాన్ని అధిగమించేందుకు యోగా, ధ్యానం, వ్యాయామం చేయడంతో పాటు మానసిక వైద్యుల సలహాలు పాటించాలని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్, సండోజి హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 10 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రంలో జరిగే మానసిక ఆరోగ్య వారోత్సవాలకు సంబంధించి ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ లోగోను సెంట్రల్ జోన్ డీసీపీ కె శిల్పవల్లి, అడిషనల్ డీసీపీలు ఆనంద్‌కుమార్, ఏసీపీ యాదగిరి, తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏ కరీం, సండోజి హెల్త్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ ఎ రాకేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ మానసిక సమస్యలు ఎదురైనప్పుడు సహజ సమర్థతతో సంతృప్తికరమైన జీవన విధానమే మానసిక ఆరోగ్యానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆధునిక అంతర్జాల ముసుగులో మానసిక ఒత్తిడి అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో భాగమైందన్నారు. తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం ఏ కరీం, సండోజి హెల్త్ ఫౌండేషన్ సభ్యుడు ఎ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు మానవతా అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యం అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా మానసిక ఆరోగ్యం అవగాహనపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దోమలగూడ సీఐ ఎండీ అంజద్‌అలీ, డాక్టర్ కృష్ణగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన రెండు భవనాలు సీజ్



భవనాన్ని సీజ్ చేస్తున్న డీఎంసీ రామానుజుల రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్

రాంనగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అనుమతులకు విరుద్ధంగా ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణాలను డీఎంసీ రామానుజులరెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్‌లు బుధవారం సీజ్ చేశారు. సర్కిల్‌లోని భోలక్‌పూర్‌లో ఇంటి నెంబర్ 1-4-479/2/ఎ యజమాని స్టీల్ ప్లస్ రెండు అంతస్తుల అనుమతి తీసుకుని అదనంగా రెండు అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ నిర్మించారని ఫిర్యాదు రావడంతో అధికారులు ఇంటి యజమానికి నోటీసులు జారీచేశారు. అయినప్పటికీ నిర్మాణ పనులు చేయడంతో బుధవారం అధికారులు పోలీసు బందోబస్తుతో వచ్చి ఆ భవనాన్ని సీజ్ చేశారు. అలాగే ముషీరాబాద్‌లోని దయార మార్కెట్‌లో ఓ ఇంటి యజమాని కూడా అనుమతికి మించి రెండు అంతస్తులు నిర్మిస్తున్నారని ఫిర్యాదు రావడంతో స్లాబ్ చెక్కలను సిబ్బందిచే తొలగింపచేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రేటర్ యాదవ సంఘం చైర్మన్ నందకిషోర్‌యాదవ్

22న నారాయణగూడలో సదర్ వేడుకలు

బర్కత్‌పుర, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : దీపావళి అనంతరం ప్రతి సంవత్సరం నిర్వహించే సదర్ వేడుకలు ఈనెల 20నుంచి ప్రారంభమవుతాయని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ చిత్తబోయిన నందకిషోర్‌యాదవ్, గ్రేటర్ అధ్యక్షుడు బోయిని వెంకటేష్‌యాదవ్ తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 20న లక్ష్మీదేవి పూజలు నిర్వహించి సదర్ వేడుకలు ప్రారంభించుకోవాలని, 21న జంటనగరాలలో సదర్ సమ్మేళనాలు నిర్వహించుకోవాలని, 22న రాత్రి నారాయణగూడ వద్ద అతిపెద్ద సదర్ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని వారు తెలిపారు. జంటనగరాలలో సదర్ వేడుకల సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ల చొరవతో రాష్ట్ర ప్రభుత్వం సదర్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించిందని దీనికి యాదవులంతా సంతోషంగా ఉన్నారని వారు చెప్పారు. నారాయణగూడ సదర్ సమ్మేళనానికి సీఎం రేవంత్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించాలని నిర్ణయించినట్లు వారు చెప్పారు.

12న దసరా మిలాప్

రాంనగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 12న ఉదయం 10గంటలకు రాంనగర్‌లోని ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన దసరా మిలాప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక మీడియా కన్వీనర్ గజ్జెల సూర్యనారాయణ, మిలాప్ కార్యక్రమ కన్వీనర్లు ఆర్.వివేక్, ఎం.శ్యాంసుందర్, గడ్డం నవీన్, గండి కృష్ణ, అరుణ, జి.వెంకటేష్, భాస్కర్, రామస్వామి, జి.వై.గిరి, కె.పరిమళ్‌కుమార్, వి.సదానంద్ తెలిపారు. బుధవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతియేటా మాదిరిగా ఈ సంవత్సరం దసరా మిలాప్ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని దళితులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా సమాధి ఉత్సవాలు



దినకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు మహేష్, అసోసియేషన్ సభ్యులు

కవాడిగూడ : షిరిడీ సాయిబాబా 107వ సమాధి ఉత్సవాలు కవాడిగూడ తాళ్లబస్తీలో సాయిఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా రోజున ప్రారంభమైన సాయిబాబా సమాధి ఉత్సవాలు నగరంలో ఎక్కడాలేని విధంగా కవాడిగూడ తాళ్లబస్తీలో నిర్వహిస్తున్నా రు. దీంతో సాయిబాబా భక్తులు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి చుట్టు పక్క ప్రాంతాల నుంచి పెద్దఎత్తున హాజరై సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సాయిబాబాను దర్శించుకునేందుకు హాజరవుతున్న వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, సంఘ సేవకులను నిర్వాహకులు ఆర్ మహేష్, ఆర్ శ్రీనివాస్‌లు శాలువాలు మెమెంటోలతో ఘనంగా సత్కరిస్తున్నా రు. సమాధి ఉత్సవాల సందర్భంగా పుష్పార్చన, అన్నదానం, పల్లకిసేవ, మంగళగౌరీపూజ, పాలు పంపిణీ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 41సంవత్సరాలుగా షిరిడీ సాయిబాబా సమాధి ఉత్సవాలను శ్రీసాయి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ఆర్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

కులాంతర వివాహ రక్షణ చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

రాంనగర్ : స్వకుల వివాహాలు సమాజాభివృద్ధికి ఆటంకమేనని, కులమతాంతర వివాహాలు చట్టవిరుద్ధం కాదని, చట్టబద్ధమైనవని వివాహం సహజీవన ఒప్పందం అని ప్రభుత్వం, పౌర సమాజం ప్రోత్సహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కులాంతర వివాహ రక్షణ చట్టం అమలు చేయాలని సూచించారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్‌గ్యాలరీలో కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ, సుందరయ్యవిజ్ఞానకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వెన్నెల హరీష్‌ల ఆదర్శ వివాహం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి పూర్వ సంపాదకుడు ఎస్‌వికే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పాల్గొని ఆదర్శ వివాహం జరిపించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీరాంనాయక్, విజయకుమార్, రమేష్, రజనీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితరులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న భారతీయ స్వయంసేవక్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, డి సుదర్శన్‌బాబు

కవాడిగూడ , అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేసేందుకు ప్రయత్నించిన న్యాయవాది రాకేష్‌కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించి రాకేష్‌కిషోర్ పోస్టర్‌ను చెప్పులతో కొడుతూ వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ న్యాయమూర్తి గవాయిపై దాడిని భారతదేశ ప్రజలందరూ ఖండించాలని డిమాండ్ చేశారు. న్యాయమూర్తిపై దాడి చేశారంటే చట్టాన్ని వ్యతిరేకించడంతో పాటు చట్టంపై దాడిచేసినట్లేనని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బూర్గు వెంకటేశ్వర్లు, మాలమహానాడు, దళిత సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భారతీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో..

భారతీయ స్వయంసేవక్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి సుదర్శన్‌బాబు, భారతీయ స్వయం సేవక్ వ్యవస్థాపక సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, బింగి రాములు, బీసీ వికాస సమితి అధ్యక్షుడు బాశెట్టి నర్సింగ్‌రావు, కోహిర్ లాజర్, సీహెచ్ దేవదానం, నర్సింహ, మైలారం వెంకటేష్, సంగం మహేష్, వెంకటేష్ శ్రీనివాస్‌లు నిరసనలో పాల్గొన్నారు.

దాడిని ఖండించిన తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్

జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది చెప్పులు విసరడానికి ప్రయత్నించడం అత్యంత హేయమైన చర్య అని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేక అనాగరిక దేశంలో ఉన్నామా అని ఆయన ప్రశ్నించారు. ఆయన కవాడిగూడలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజా స్వామ్య దేశంలో స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే న్యాయవ్యవస్థకు దేశంలో ఎంతో గౌరవం ఉందని, అలాంటి న్యాయమూర్తులపై విచక్షణ కోల్పోయి ఆటవికులుగా దాడులకు ప్రయత్నించడాన్ని ప్రతి భారత పౌరుడు ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి: సీజేఐపై జరిగిన దాడి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినచర్యలు తీసుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ సీజేఐపై దాడి న్యాయవ్యవస్థపై దాడిగా భావిస్తున్నామన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన న్యాయవాదిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలన్నారు.

జస్టిస్ గవాయిపై దాడి దుర్మార్గ చర్య

నల్లకుంట: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీ.ఆర్.గవాయిపై దాడి దుర్మార్గ చర్య అని దళిత సేన మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డి మల్ల పార్వతి అన్నారు. ఈ దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్‌కిషోర్‌ను దేశద్రోహిగా ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి సిగ్గుచేటు అని, ఇది భారత రాజ్యాంగంపై మనువాద మతోన్మాద దాడి అని పేర్కొన్నారు.